నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 24 డిసెంబర్ 2024 | SIDDIPET

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులకు మద్దతు ప్రకటించి మాట్లాడుతున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ విమర్శించారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సోమవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి అవగాహన లేకుండా అన్ని చేస్తాం అని అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాడని దుయ్యబట్టారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి చెయ్యకపోవడం దారుణమన్నారు. వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. నూతనంగా రిక్రూట్మెంట్ చేస్తే విధిగా వేయిటేజ్ కల్పించాలన్నారు. అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్నందున వేయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గులాబీ అధినేత కేసీఆర్ కంటే ఎక్కువ పెన్షన్ ఇస్తామని చెప్పినా ఉన్న పెన్షన్‌ను సక్రమంగా ఇచ్చే పరిస్థితిలే దన్నారు. అలాంటి హామీలు అనేకం అనాలోచితంగా రేవంత్‌రెడ్డి ఇచ్చారని, కానీ అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

## సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

బోనాలతో సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సిద్దిపేట, డిసెంబర్ 23: సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పిస్తూ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు బోనాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభు త్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమా ండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, రాష్ట్ర నాయకురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ హయాంలో పండుగలకు ప్రాధాన్యం

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి**

గజ్వేల్, డిసెంబర్ 23: కేసీఆర్ హయాంలో పండుగలకు ప్రాధాన్యం లభించిందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని క్రిస్టియన్ భవనంలో నిర్వహించిన క్రిస్మస్ సంబురాల్లో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రతి యేడు క్రిస్మస్ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కానుకలు అందజేసి ముందస్తుగానే శుభాకాంక్షలు తెలిపిందన్నారు. కులమతాల కతీతంగా కేసీఆర్ అన్ని పండుగలకు ప్రాధాన్యం కల్పించడంతో అన్ని వర్గాలు పండుగలను సంతోషంగా జరుపుకునే వారన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసి పండుగల సమయాల్లో కానుకలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఆర్డీవో చంద్రకళ, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రవణ్, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు భాస్కర్, మోహన్, శివారెడ్డి పాల్గొన్నారు.

## ప్రజల జీవితాల్లో మార్పురావాలి

హుస్నాబాద్‌లో క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 23: ఏసుప్రభు ఆలోచన విధానంతో మనందరం ముందుకు పోవాల్సిన అవసరం ఉందని రవాణా,బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రైస్తవులతో కలిసి కేక్‌కట్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవవిలువలు, ప్రేమ, ఆప్యాయతతోనే ముందుకు పోవాలని, ఘర్షణలు పడకుండా చర్చలు, శాంతితోనే అన్నింటినీ పరిష్కరించుకునే విధంగా వెళ్లాలని ఏసు సూచించాడని చెప్పారు. ప్రజల జీవితాల్లో మార్పురావాలని, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వానికి దీవెనలు ఇవ్వాలని వేడుకొన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించే విధంగా బలాన్ని ఇవ్వాలని యేసుప్రభువును వేడుకున్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, సింగిల్‌విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డితోపాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

## జాతీయ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

**గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ**



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పూలబొకే అందజేసి స్వాగతం పలుకుతున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 23 : విద్యార్థి శక్తి, జాతీయ శక్తి అని.. జాతీయ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమైందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ పునర్నిర్మాణంలో విద్యార్థులు, యువత ముందుండాలని సూచించారు. ప్రవర్తన సమాజంలో మన స్థాయిని నిలబెడుతుందన్నారు. కలలు కనడంతోనే సరిపెట్టుకోకుండా దాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. అంతకుముందు సిద్దిపేట కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న గవర్నర్‌ను కలెక్టర్ మను చౌదరి, ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ అఖిల్ మహాజన్ పూలబొకేతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, పలువురు ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

మెదక్ చర్చిలో మాజీ మంత్రి హరీశ్‌రావును ఆశీర్వదిస్తున్న ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్

# క్రీస్తు బోధనలు అనుసరణీయం

- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలకు హాజరు
- ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని చర్చి ఆవరణలో క్రిస్మస్ కేక్ కట్ చేసిన మాజీ మంత్రి

మెదక్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : శాంతి, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మెదక్ చర్చిని ఆయన సందర్శించారు. సీఎస్ఐ ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ....ప్రజలందరికీ సుఖ శాంతులు కలగాలని ఆయేసును ప్రార్థిస్తున్నానని చెప్పారు. మెదక్ చర్చి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఇంత గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, పేరు పేరునా ప్రతి ఒక్కరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వందేళ్లుగా ఆసియాలోనే రెండో అతిపెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రంగా మెదక్ చర్చి వర్ధిల్లుతోందని గుర్తు చేశారు. చర్చి నిర్మాణాన్ని ఇంగ్లాండ్‌కు చెందిన రెవరెండ్ చార్లెస్ వాకర్ ఫాస్నెట్ 1914 లో ప్రారంభించారని, 1924 డిసెంబర్ 25న పూర్తయ్యిందని తెలిపారు. వందేళ్ల శతాబ్ది ఉత్సవాల్లో చార్లెస్ వాకర్ ఫాస్నెట్ మనువడు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. చారిత్రాత్మకమైన చర్చి మన మెదక్ జిల్లాలో ఉండటం మనకే కాదు, యావత్ తెలంగాణ రాష్ట్రానికి ఎంతో గర్వకారణమన్నారు. మీ అందరికీ తెలుసు కేసీఆర్ ప్రభుత్వం పోయి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయిందన్నారు. గత తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ క్రిస్టియన్లకు ఏం చేశారు? ఎంత బాగా చూసుకున్నారో మీ అందరికీ తెలుసునని గుర్తు చేశారు. క్రిస్మస్‌ను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించి ఘనంగా నిర్వహించారన్నారు. క్రిస్మస్‌ను అధికారికంగా జరిపిన ఒకే ఒక్క నేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని గుర్తు చేశారు. క్రిస్మస్ డే మరుసటి రోజు జరుపుకొనే బాక్సింగ్ డేను సెలవుగా ప్రకటించారని పేర్కొన్నారు. ప్రతి క్రిస్మస్ పండుగ రోజు పేద క్రిస్టియన్లకు గిఫ్టులు పంపిణీ చేశారని, కేసీఆర్ ఒక్క మతమని కాదు, హిందూ, ముస్లిం, క్రిస్మస్, సిక్కు ఇలా అన్ని మతాలను సమానంగా గౌరవించి, వారు సంతోషంగా జీవించేలా చూశాడని చెప్పా రు. అన్ని వర్గాలు బాగున్నాయి కాబట్టే హైదరాబాద్, తెలంగాణ భిన్నత్వంలో ఏకత్వం అనడానికి నిదర్శనంగా నిలుస్తున్నదన్నారు. అనంతరం చర్చి ఆవరణలోక్రిస్మస్ కేక్‌ను ఆయన కట్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు బట్టి జగపతి, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్చి ఆవరణలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## ఉద్యోగులు సమ్మె చేస్తున్నా సర్కార్‌కు పట్టదా?

- అల్లు అర్జున్ సమస్య ముఖ్యమైందా... ప్రజల సమస్యలు ముఖ్యంకావా...?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- మెదక్‌లో సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతు

మెదక్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : సమగ్ర శిక్షా ఉద్యోగులు 13 రోజులుగా సమ్మె చేస్తున్నా కాంగ్రెస్ సర్కార్‌కు కనిపించడం లేదా అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. మెదక్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ...రేవంత్‌రెడ్డికి అల్లు అర్జున్ సమస్య ముఖ్యమైంది కానీ, ప్రజల సమస్యలు ముఖ్యం కావా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 20 వేల సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు రోడ్డు మీద పడితే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత చాయ్ తగినంత సమయంలో సమస్యలు పరిష్కరిస్తా అని మాట తప్పారని విమర్శించారు. డిసెంబర్ 9 నుంచి సమ్మె చేస్తుంటే ఎందుకు సమగ్ర శిక్షా ఉద్యోగులను పిలిచి వారి సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో నిలదీసినా స్పందన లేదన్నారు. అన్నివర్గాలను రేవంత్ రెడ్డి, మంత్రులు మోసం చేశారని దుయ్యబట్టారు. అసలు విద్యాశాఖకు మంత్రి లేడని, బడ్జెట్‌లో 15 శాతం నిధులు అని, 7 శాతం కూడా పెట్టలేదన్నారు. నిరసన చేపట్టడం వల్ల లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం అయ్యిందన్నారు. గ్రీన్ చానెల్ నిధులు అనేది వట్టి మాటలేనని, సస్పెండ్ చేయాల్సింది వార్డెన్లు, ప్రిన్సిపాళ్లను కాదని, రేవంత్ రెడ్డిని చేయాలని ఘాటుగా విమర్శించారు. ఉన్న పథకాలు ఇవ్వరు, కొత్త పథకాలు లేవని, పింఛన్లు పెంచుతామని మోసం చేశారన్నారు. వృద్ధాప్య పింఛన్లు రెండు నెలలుగా ఎగ్గొట్టాడని, మాజీ సర్పంచులకు బిల్లులు ఇవ్వడం లేదని, ప్రశ్నిస్తే ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ ఇచ్చిన హామీ అమలు చేసేదాకా నిరంతరం మీకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, సమస్య పరిష్కారమయ్యేదాకా కొట్లాడుదామని పిలుపునిచ్చారు. ఈ నెల 25న మెదక్ చర్చికి వస్తున్న రేవంత్‌కు చీము నెత్తురు ఉంటే సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె చేస్తున్న టెంట్ వద్దకు రావాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించండి... రేవంత్‌ను నిలదీయాలని ఆయన సూచించారు.

## విశ్రాంత ఉద్యోగుల హక్కుల సాధనకు కృషి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 23: విశ్రాంత ఉద్యోగుల హక్కుల సాధనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల జిల్లా భవనాన్ని సోమవారం ఆయన సందర్శించారు. కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపు కోసం కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం కృషి చేస్తానన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను శాలువాతో సన్మానించారు. 2018లో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సహకారంతో సంఘం భవనానికి స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ వద్దు .. పంచాయతే ముద్దు

**జాతీయ రహదారిపై రైతు సంఘం నాయకులు, ప్రజల ఆందోళన**

గుమ్మడిదల,డిసెంబర్ 23: మున్సిపాలిటీ ఏర్పాటు చేసి సామాన్య ప్రజల పొట్ట కొట్టొద్దని రైతులు, ప్రజలు జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో రైతు సంఘం నాయకులు, ప్రజలు జాతీయ రహదారిపై మున్సిపాలిటీ వద్దు.. గ్రామపంచాయతీ ముద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. గంటపాటు జాతీయ రహదారిపై ఆందోళన చేయడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు మద్దుల బాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ ఖజానాను నింపుకోవడానికి గ్రామీణ ప్రాంతాలను మున్సిపాలిటీలుగా మార్చి సామాన్య ప్రజలపై పన్నుల భారం వేయడానికే కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు నాయకుడు పడమటి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయకూలీలుగా బతుకుతున్న సామాన్య ప్రజలపై పన్నుల భారం మోపడం సరికాదన్నారు. రాష్ట్ర ఖజానాపై ఉన్న శ్రద్ధ ప్రజల జీవన పరిస్థితిపై లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితిలో మున్సిపాలిటీగా అంగీకరించమని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. మున్సిపాలిటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఆందోళన చేస్తామన్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ గంగాభవాని ఆందోళన చేస్తున్న స్థలానికి చేరుకున్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ రైతులు, ప్రజలతో మాట్లాడి మీ డిమాండ్‌ను జిల్లా స్థాయి అధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఆందోళనకారులు తహసీల్దార్‌కు మున్సిపాలిటీ వద్దు గ్రామపంచాయతీ కావాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తన సిబ్బందితో వచ్చి రైతులను సముదాయించి ఆందోళనను విరమింపజేశారు. రైతులు ఉదయ్‌కుమార్, బాలకృష్ణారెడ్డి, సదానందరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో మున్సిపాలిటీ వద్దు గ్రామపంచాయతే కావాలి అంటూ జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు, ప్రజలు

## సంగారెడ్డిలో ప్రజావాణికి 68 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 23: ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 68 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్వో పద్మజా రాణితో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆయా అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇండ్ల సర్వే పారదర్శకంగా చేపట్టాలి**

అనంతరం ఆయా శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం గ్రామ పంచాయతీలు, మునిపాలిటీల్లో క్షేత్ర స్థాయిలో సర్వే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ నెలాఖలోగా సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్లకు వెళ్లి వారు ఇచ్చిన అంశాలను పరిశీలించి మొబైల్ యాప్‌లో వివరాలు పొందుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో పరమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న మెదక్ డీఆర్‌వో భుజంగరావు

**మెదక్ డీఆర్‌వో భుజంగరావు**

మెదక్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని మెదక్ డీఆర్‌వో భుజంగరావు అధికారులకు సూచించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, సంబంధిత అధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 85 దరఖాస్తులు రాగా వాటిని సంబంధితశాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలపై వచ్చిన దరఖాస్తులకు ముందు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని ఆదేశించారు. భూ సంబంధిత సమస్యలు-35, ఇందిరమ్మ ఇండ్లు-12, పింఛన్-3, ఇతర సమస్యలపై 35 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పులబాధతో రైతు ఆత్మహత్య

రైతు రాజు(ఫైల్)

వెల్దుర్తి, డిసెంబర్ 23. అప్పుల బాధతో రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో రామాయిపల్లిలో చోటు చేసుకుంది. వెల్దుర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బత్తుల రాజు (40) తన కున్న వ్యవసాయ పొలంలో ఈ నెల 18న రెండు బోరుబావులు తవ్వించినా నీరు రాలేదు. బోర్లు తవ్విన వారికి ఇవ్వడానికి పైసలు లేక ఆదివారం ఇతరులను అప్పు అడిగినా దొరకలేదు. పాత అప్పు రూ. 10 లక్షల వరకు ఉండగా, బోర్లతవ్వకానికి పైసలు లేకపోవడం, అప్పు దొరకక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో అందరితో కలిసి భోజనం చేసిన తర్వాత కుటుంబసభ్యులతో కలిసి నిద్రించాడు. రాత్రి 10గంటల ప్రాంతంలో రాజు తమ్ముడు కుమార్ వచ్చి రాజు భార్య రేణుకను అన్న ఎక్కడ అని అడగగా ఇంట్లో లేక పోవడంతో ఆమె కంగారుపడింది. ఏం జరిగిందని అడగగా తమ్ముడు చల్ల మహేశ్‌కు ఫోన్ చేసి అప్పులు ఎక్కువయ్యాయి, నేను చనిపోతున్నా అని చెప్పాడని రేణుకకు తెలిపాడు. రాజు కుటుంబసభ్యులు, గ్రామస్తులతో కలిసి వెతకగా గ్రామశివారు పటేల్‌కుంట కట్టకింద చెట్టుకు ఉరి వేసుకొని రాజు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు తెలుపగా ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా చేసి మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రాజు భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రాజుకు భార్యతో పాటు కూతురు. కుమారుడు ఉన్నారు